మానవులందరూ కోరే స్వర్గానికి ధర్మ రాజుతోబాటు మా వంశీయుడు కూడా ఆరోహణం చేశాడు. భారత, భాగవతాల కాలం నుండీ అలా తరతరాలుగా మా జాతి అభివృద్ధి చెందుతూ వస్తూంది. అటువంటి మా జాతిలో మీరంతా తరతమ భేదాలు తెచ్చి పెట్టారు. ఇది జాతికుక్కా? సంకరజాతికుక్కా? అని మమ్మల్ని చూడగానే ప్రశ్నలు వేసి మాకేసి ఎగాదిగా చూసి మా కాలిగోళ్ళు లెక్క పెట్టి, చెవులు పట్టుకుని గాలిలోకి ఎత్తి మా గుణగణాలను తెలుసుకోవ డానికి ప్రయత్నిస్తారు. మా గుణగణా లతో మాని పోల్చి చూసి మీరంతా మాట్లాడుతూంటే నాకు ఎక్కడలేని నవ్వు వస్తూంది. మాది మాదే! మీది మీదే. మాకున్న విశ్వాసం మీకుందా, చెప్పండి? మీరంతా బహురూపులు! ఇంటి దగ్గర భార్య సన్నిధానంలో ఒక రూపం, పక్కింటి అమ్మాయి మీ సుందర వదనార విందం తిలకించి మోహంతో మూర్ఛపోతుందనుకుని మరొక రూపం దాలుస్తారు. ఆఫీసులో ఒక రూపం! భగవంతుని సమక్షంలో మరొక రూపం! భగవాన్! మా నిజరూప మేమయ్యో! పుట్టింది మొదలు గిట్టేవరకూ మాది ఒకటే రూపం! మేము మోసగించము! మోసగించుకోము!

ఇంతకీ మీ లెక్కప్రకారం మా అమ్మమ్మ మాంచి సీమ జాతికి చెందిందే! నల్లగా నిగనిగలాడుతూండేది! నల్లగా ఉన్నా జాతికుక్కే! మాకు నలుపు, తెలుపులతో నిమిత్తం లేదు! మీరే నవనాగరికులమని, చంద్రమండలంలో అడుగుపెట్టామని, అణుశక్తిని కను గొన్నామని, ప్రకృతిని సాధించి పిడికిలిలో బిగపట్టుకున్నామని విర్రవీగుతూన్న మీరే నలుపు, తెలుపుల మధ్య జాతి విద్వేషాలు



పెంచి తెలుపే గెలుపనుకుని నల్లజాతి వారిపై అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. నాకు తెలియక అడుగుతాను. చర్మం రంగు చూస్తున్నారే కాని, చర్మం కింది మానవతను గమనిస్తున్నారా? గమనించిన వాడు మహాపురుషులు, అవతార మూర్తులు కన్న విశ్వమానవ కళ్యాణ స్వప్నం నిజం కాదా? అందరు మానవులూ మహా పురుషులు కాలేరు; అవతార మూర్తులూ కాలేరు! అన్ని దౌర్బల్యాలతో మానవులుగానే ఉండి పోతారు! మానవ మేధ ఎంత శ్రమ పడినా, మానవునిలో మాత్రం మార్పు రావడం కల్ల! అంత దూరమెందుకు? సృష్టికర్తనే పరాజితుణ్ణి చేస్తున్నాడు మానవుడు.

ఎంత మీ గురించి మాట్లాడకుండా ఉందామన్నా ఉండలేక పోతున్నాం. కారణం—అది మానవుడు మొట్టమొదటగా మచ్చిక చేసుకున్న ప్రాణి కుక్కేగా! మీరేమో ఛాతీ విరుచుకుని నా వైపు చూసి, "మేము మచ్చిక చేసుకున్నాము కాబట్టే మీరు మాతోబాటు మా కుటుంబాలలో ఒక మనిషిగా బ్రతక గలుగుతున్నారు. కాకపోతే తతిమ్మా జంతువుల్లా మీరూ అడవుల పాలు కావలసిందే" అని అంటున్నారు కదూ? ఒక రహస్యం చెబుతా, వినండి. మీకు మేము రెండు సుగుణాలను నేర్పదలిచాము. ఒకటి—స్నేహం; రెండవది—విశ్వాసం. మా జాతి నేత అది మానవుని కాలం నుండి నేటి వరకూ మాతో కలిసి ఉండి అవిధార్గవతంగా దీక్షపూని ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. విఫలులైనా ప్రయత్నం మానలేదు.

మా విశ్వాసం గ్రహించిన మానవులే మాలోని సుగుణం చిహ్నంగా జపానులో ఒక శిలా ప్రతిమను స్థాపించారు.

హచికో యజమానిని ఎంతో ప్రేమించింది. అతను ఫ్యాక్టరీలో పని చేస్తుండేవాడు. ఆ ఫ్యాక్టరీ చేరాలంటే రైలు ప్రయాణం చేయాలి. ప్రతి రోజూ పొద్దున్నే రైలు స్టేషనుకి వెళ్ళే యజమాని వెంట హచికో కూడా వెళ్ళేది. యజమాని రైలు ఎక్కగానే తాను ఇంటికి వచ్చేసేది.

సాయంత్రం తిరిగి వచ్చే యజమాని కోసం స్టేషనుకి వెళ్ళి, అతనికోసం వేచి ఉండి, అతనితోబాటు ఇంటికి తిరిగి వచ్చేది. అలాగ పది సంవత్సరాలు గడిచి పోయాయి.

ఒక నాడు ఉదయం ఫ్యాక్టరీకి వెళ్ళిన యజమాని సాయంత్రం బండిలో తిరిగి రాలేదు. ఇంకా వస్తాడనే ఆశతో రాత్రంతా స్టేషను దగ్గరే హచికో కూర్చుని ఉంది. రైళ్ళు వస్తున్నాయి, వెడుతున్నాయి. స్టేషను బయటికి వచ్చిన జనంలోకి వెళ్ళి తన యజమానికోసం వెతికింది. యజమాని రాకపోవడం చూసి హచికో తిరిగి ఇంటికి వెళ్ళిపోయింది.

కాని, ప్రతి రోజూ హచికో సాయంత్రం స్టేషనుకి వెళ్ళడం మానలేదు. తన యజమానికోసం రాత్రంతా కాచుకు కూర్చునేది. ఈ నిరీక్షణ కొన్ని సంవత్సరాలు సాగింది. హచికో ముసలిదవడం ప్రారంభించింది. శక్తి లేక పోయినా సరే, ప్రతి రోజూ సాయంత్రం హచికో యజమాని వస్తాడనే ఆశతో రైలు స్టేషనుకి వెడుతూ వచ్చింది. ఎండ తెలిసేది కాదు. చలి తెలిసేదికాదు. వాన తెలిసేదికాదు. తరుచు ప్రయాణించే మనుష్యులు హచికో ప్రతి రోజూ రావడం చూసి ఆశ్చర్యపోయేవారు.

ఒక రాత్రి విపరీతంగా మంచు కురిసింది. ఆ మంచులో ముసలి హచికో యజమానికోసం ఆ రాత్రంతా వేచి ఉంది. తరువాత ఏమైందో తెలియదు. తిరిగి ఇంటికి వెళ్ళలేక పోయింది. అక్కడే స్టేషను దగ్గరే యజమాని ప్రయాణించే రైలుబండి వైపే చూస్తూ ప్రాణం

# జనమంచి రామకృష్ణ

చచ్చిపోయింది. హచికోని తెలిసినవాళ్ళు కన్నీరు కార్చారు. అంతతో ఆగలేదు. హచికో జ్ఞాపకార్థం అది మరణించిన స్థలంలో దాని విగ్రహం స్థాపించారు. విగ్రహం క్రింద ఇలా వ్రాశారు కూడా: "నిరంతర నిరీక్షణ."

నేటికి కూడా నిరీక్షించే వాళ్ళు హచికో విగ్రహం దగ్గిర నిలబడతారు. ప్రేయులు, తండ్రులు, తల్లులు, అన్నలు, తమ్ముళ్లు — ఒకరేమిటి? నిరీక్షించే వారందరూ.

మా అమ్మమ్మ ఇంగ్లండులో పుట్టింది. యజమాని మా అమ్మమ్మ తోక కోయించేశాడు. చాలా బాధపడిందట. తోకలు కోయడం ఇంగ్లీషు వాడిదగ్గిర్నించే మీరు నేర్చుకున్నారుటగా! ఇంగ్లీషువాడు సామ్రాజ్య మదంతో ఎంత హీనంగా, క్రూరంగా ప్రవర్తించినా, తన వాడి పట్ల, తన దేశం పట్ల అభిమానం కలవాడు. మానవత్వపు విలువలు కల వాడు. అన్నిటికన్నా శీలం ఉన్నవాడు.

అదేమి కర్మమో — నాలుగైదు సంవత్సరాలు అయ్యేసరికి [illegible] ఉన్నా వాటిలోని ఆ ఒక్క [illegible] — శీలాన్ని మీరు అనుకుంటారా! ఇంత స్వార్థం మీకు ఎలా వచ్చి పడింది!

అమ్మమ్మ యజమానితో ఇక్కడికి వచ్చేసింది. అయినా కూడా ఇక్కడే ఉండేవాడు. అయినా, అతను పెంచు కుంటున్న కుక్క శ్వేతజాతిది. ఇష్టం దూరంతో పుట్టింది. అందుకే ఇక్కడి కుక్కల్ని — ఎంతమంచివైనా, తెల్లవైనా సరే, ఈసడింపుతో చూసేవాడు.

మా అమ్మమ్మకి అటువంటి పేర్మి ఏమీ లేదు! గొలుసు తెంపుకుని [illegible] వారితో కలసి [illegible] తిరుగుదామని తాపత్రయపడేది. అమ్మమ్మ ఉంటున్నది పెద్ద బంగళా. చుట్టూరా పెద్ద తోట. బల్లలు, [illegible] యజమాని, అమ్మమ్మని చూసుకునేందుకు ఒక నౌకర్ని ప్రత్యేకంగా నియమించాడు. వాడు అమ్మమ్మకి పొద్దున్న, సాయంత్రం షికారుకి తీసుకెళ్ళేవాడు. బ్రష్‌తో ఒళ్ళంతా దువ్వి, పౌడరు వేసేవాడు. ఇంక తిండి విషయంలో అతి జాగ్రత్త పడేవాడు.



జానపద నృత్యం

ఫొటో—దిలీప్ బెనర్జీ (కలకత్తా)




అమ్మమ్మ తిండి తినే వేళకు తోట మాలి పిల్లలు అమ్మమ్మ కంచంలో మాంసం తింటూంటే చుట్టూరా చేరి లొట్టలేసుకుంటూ తదేకధ్యానంతో చూస్తూ కూర్చునేవారు. మాలి ఆఖరి పిల్లవాడు అమ్మమ్మ పాలు తాగుతూంటే ఆవురావురుమని కంచంలోకి ఎగబడే వాడు. అమ్మమ్మ వాళ్ళందర్నీ చూసి జాలిపడి మాంసం తినకుండా, పాలు తాగకుండా కన్నీరు కారుస్తూ వాళ్ళకేసి చూసేది. ఏం చేయగలదు? మనసుంది. జాలి ఉంది. గుండె ఉంది. నోరు లేదు.

రోల్స్ రాయిస్ కారులో కుటుంబంతో సాయంత్రం బీచ్‌కి షికారుకి వెళ్ళేది. బీచ్‌లో యజమాని పిల్లలతో ఇసకలో ఆడుకునేది. తోటమాలి పిల్లలు మాత్రం ఆ గుడిసెలో ఆ గుడ్డి కిరసనాయిలు దీపం చుట్టూ చేరి, పొయ్యి మీద తమ తల్లి కాస్తున్న గంజి కోసం కాట్లాడుకునేవారు.

తనని అజమాయిషీలో పెట్టే నౌకరు వెళ్ళిపోగానే, ఎవరికీ తెలియకుండా అమ్మమ్మ తోటమాలి గుడిసెలో దూరేది. పిల్లలంతా అమ్మమ్మ రాగానే యజమాని వచ్చినంత భయంతో లేచి నించునేవారు.

"పిల్లలూ! ఆ చేతులతో దాన్ని తాక్కండి! మాసిపోతుంది! దాన్ని ముట్టుకోకండి" అని మాలి భార్య కేకలు పెట్టేది. అమ్మమ్మను తోటమాలి ఎత్తుకుని బంగళాలోకి తీసుకెళ్ళి వదలి పెట్టేందుకు ప్రయత్నిస్తే, అమ్మమ్మ తోక ఆడించుకుంటూ పిల్లలందరి దగ్గరికీ వచ్చి, వరసగా ముఖాలు నాకి, తోక ఆడించుకుంటూ మాలితో వెళ్ళిపోయేది.

ఆవేవో పోటీలు జరిగేవి పట్టణంలో మీలోకూడా పోటీలు జరుగుతాయిగా— బ్యూటీ కంటెస్టులనీ, మిస్ ఇండియా లనీ, మిస్టర్ ఇండియా అనీ? యజమాని అమ్మమ్మని కూడా ఆ పోటీలకి తీసుకు వెళ్ళే వాడు. ప్రతి పోటీ లోనూ అమ్మమ్మదే గెలుపు. గెలుపొందిన రోజున అమ్మమ్మని సింహాసనం మీద కూర్చో బెట్టి పెద్ద పండుగ చేసేవాడట! స్నేహితులందరూ తమ తమ శునక రాజాలను తీసుకువచ్చేవారు.

అమ్మమ్మ బహుసాధ్వి. ఎవరినీ కరిచేది కాదు. మొరిగి భయపెట్టేది కాదు. కాని, అమ్మమ్మని చూసి అందరూ భయపడేవారు.

గడ్డం గీసుకునే బ్లేడ్లు ఈ దేశం లోకి కొత్తగా వచ్చాయి, ఇంగ్లండు నుంచి. అదొక అపురూపమైన వస్తువు. పెద్ద పెద్ద ఆఫీసర్లూ, భాగ్యవంతులే గడ్డాలు గీసుకునేందుకు బ్లేడ్లు వాడేవారు.

వాడిన బ్లేడ్లతో పెన్సిళ్ళు చెక్కుకో వచ్చని పిల్లలు పరిశోధన చేశారు. ఫలితంగా పిల్లలు అమ్మమ్మ యజమాని బట్లరు వెనకాల పడేవారు. వాళ్ళ దృష్టిలో బట్లరు హీరో! పిల్లలు తెచ్చిన పెన్సిళ్ళను బట్లరు అతి చాకచక్యంతో చెక్కేసి ఇచ్చేవాడు. పిల్లలకి సంతృప్తి కలిగేది కాదు. బ్లేడ్లను స్వంతం చేసు కోవాలి. వాడిన బ్లేడ్లను వెల కట్టి బట్లరు పిల్లల కమ్మేవాడు. బ్లేడ్ల చాపల్యం చిన్న చిన్న జేబు దొంగతనాలకి దారి తీసింది. అంతవరకూ సంపాదించు కున్న చిల్లరతో పిల్లలు చిరుతిళ్ళు కొనుక్కుని తినేవారు. తినడం మాని ఆ డబ్బుతో బ్లేడ్లు కొనుక్కునే వారు. కొనుక్కోలేని వాళ్ళు గేటు కాపలా మనిషిని ఏమార్చి బంగళా ఆవరణలో మూలగా ఉన్న తుక్కుకుండీ దగ్గిరికి దొంగతనంగా చేరేవారు. బ్లేడ్లకోసం చెత్తా చెదారాన్నంతనీ కెలికి చిందర వందర చేసేవారు. గేటు కాపలా మనిషి కంటబడగానే అమ్మమ్మని వాళ్ళమీదికి ఉసి కొల్పేవాడు. అమ్మమ్మ విని విని పించుకోనట్టు చెట్లచాటుకు పోయేది.

'పిల్లలేం చేశారని! ఎందుకు వాళ్ళని బెదిరించడం?' అని అనుకొనేదట అమ్మమ్మ!

ఎంత గేటుకాపలా మనిషి ఉన్నా తోట చుట్టూ ఉన్న ముళ్ళ కంచెను దాటి నెమ్మదిగా మేకలు లోపలికి వచ్చేవి. మొక్కలు నమిలిపారేసేవి. కాపలా వాడు అమ్మమ్మని ఉసికొల్పేవాడు. మొండితోక ఆడించుకుంటూ అమ్మమ్మ మేకల దగ్గ రికి వెళ్ళేదే కాని, వాటినిమాత్రం బెదిరించేది కాదు.

'ప్రతివాళ్ళూ వాటిని కొట్టి తరిమి వేస్తే గొడ్లూ మేకలూ బతికేదెల్లా' అని అనుకునేది.

అమ్మమ్మకోసం యజమాని రక రకాలైన కుక్కలను తెప్పించేవాడు. అమ్మమ్మ వాటిని దగ్గిరికి చేరనిచ్చేది కాదు. అవి జబర్దస్తీ చేసేవి. అయినా సరే, వాటిని చూసి ఏవగించుకునేది. అప్పుడప్పుడు రాత్రిపూట కంచె దూరి అమ్మమ్మకోసం ఒక వీధి కుక్క వచ్చేదట. కాపలా వాడు చూసినప్పుడల్లా దాన్ని బడితెతో బాదేవాడు. దాని ఏడ్పులు విన్న అమ్మమ్మ కుమిలి కుమిలి ఏడ్చేదట. ఎంత కొట్టినా ఆ కుక్కమాత్రం రావడం మానేది కాదు. ఇంటిల్లిపాది నిద్రపోయినా అమ్మమ్మ అలా ఆ కుక్క కోసం నిరీక్షిస్తూండేదట.

ఒకనాడు కుటుంబమంతా ఎక్కడో తాగుడు విందుకంటూ వెళ్ళారు. నౌకర్లకి ఆటవిడుపు. అందరూ కలిసి హాయిగా పచ్చి గడ్డి మైదానంలో సమావేశమై జల్సా చేస్తున్నారు. అమ్మమ్మకి మంచి అదును దొరికింది. నెమ్మదిగా ముళ్ళ కంచె దాటి రోడ్డుమీదికి పరుగెత్తి తన ప్రియునికోసం అన్వేషణ ప్రారంభించింది. పరిచితమైన తన గొంతు విని తప్పక ప్రియుడు వస్తాడనే ఆశతో వీధి మొగదాకా పరుగెత్తి అరవడం ప్రారంభించింది. అమ్మమ్మ గొంతు విన్న ఆ వీధి కుక్క ఎక్కడ లేని ఆనం దంతో ఆప్యాయతతో అమ్మమ్మని కలుసు కుని నేరుగా నఖశిఖ పర్యంతం నాకి పారేసి ఆనందబాష్పాలు రాల్చింది.

తన ప్రియునితో అమ్మమ్మ తోట ఆవలివైపు పరుగెత్తింది. ప్రియుడు కూడా వెనకాలే భయంతో నడవడం చూసి, "గేటు కాపలావా డున్నాడేమో నని భయపడుతున్నావా? నా కోసం, నన్ను కలుసుకునేందుకు వచ్చి ఎన్ని దెబ్బలు తిన్నావో కదా" అని తిరిగి అమ్మమ్మ ప్రియుని వీపు నాకింది.

"అలా వెనక వెనకగా నడవకు. మా యజమాని కుటుంబం ఇంట్లో లేక పోవటం చూసి వాళ్ళంతా తోట కా పక్కగా జల్సా చేసుకుంటున్నారులే! దా! నా దగ్గరగా నన్ను రాసుకుంటూ నడు."

ఇద్దరూ పచ్చిక బీడులో కెళ్ళి దొర్లడం మొదలు పెట్టారు. ఒకరి నొకరు సరదాగా కరుచుకొన్నారు. చెవులు పీక్కున్నారు.

"నా తోక పొడుగ్గా ఉందనా పట్టుకు లాగుతున్నావు — దొంగా! నా చెవుల కంటె నీ చెవులు పొడుగ్గా ఉన్నాయి" అని ప్రియుడు అమ్మమ్మ చెవుడాలు

ఎక్కి తీశాడు. అలా ఎంతోసేపు ఆడుకుని ఆడుకుని ఒళ్ళు మైమరిచిపోయిన సమయంలో అమ్మమ్మని కనిపెట్టుకునే నౌకరు కేకలు పెడుతూ వెతుక్కుంటూ అక్కడికి వచ్చి ఇద్దరి వాలకం చూసి వెర్రికోపంతో అమ్మమ్మ ప్రియుణ్ణి చావ బాదాడు. అమ్మమ్మను విడిపించుకుని కుయ్యో, మొర్రో మంటూ పారిపోయింది.

"అంత మదమెత్తితే అయ్యగారు అన్ని కుక్కలు తెచ్చారు. ఏ ఒక్కదానితో నైనా పోక వెధవ వీధికుక్క వెంట పోతావా? అయ్యగారు నన్ను చంపేస్తారే! వెధవ ఇనప జాగిలాలను కంటావు! నీ మూలాన నా ఉద్యోగం పోతుంది" అని నౌకరు గోల పెట్టాడు.

మాసాలు గడుస్తున్నాయి. తన ప్రియుడు ప్రసాదించిన గుడ్డు కడుపులో కదలడం అనుభవించి ఆనందపడుతూండేది అమ్మమ్మ.

"ఏరా, దానయ్యా?"

"ఏం దేవరా?"

"ఇది చూలుతో ఉందా? ఎలా అయిందిరా?"

"తెలియదు, దేవరా!"

"అబద్ధమాడుతున్నావు! దీన్ని బయటకు వెళ్ళనిచ్చావా?"

"లేదు, దేవరా! ఎప్పుడూ కనిపెట్టుకునే ఉంటానన్న సంగతి తమకు తెలిసిందే."

"మరైతే దీని వాలక మిలా ఉందేమిరా?"

"చిత్తం!"

"ఏమిటి చిత్తం?"

"ఆదేనండి. వాలకం ..." నౌకరు అమ్మమ్మని ఎత్తుకుని బయటకు తీసుకు పోయాడు! తన గదిలో నిలబెట్టి కడుపు తడమడం మొదలుపెట్టాడు.

"యెదవ సిగ్గులేదూ! అడ్డమైన కుక్కలతో పోకపోతే అయ్య తెచ్చిన ఏ కుక్కతోనైనా పోకూడదూ!" అని చెడామడా తిట్టాడు. అమ్మమ్మ విని ఊరుకుని తన మానాన తాను చక్కా పోయింది.

"నాకు తెలుసురా! అది వీధి కుక్కతో పోయింది. సంకరమై పోయింది! దాన్ని నా దగ్గరికి మాత్రం రానియ్యకు. కనకపు సింహాసనమున శునకము కూర్చుండబెట్టి అన్నట్టు కుక్క బుద్ధి చూపించుకుంది వెధవ!"

అంతే. అమ్మమ్మ నౌకరు ఇంట్లోనే ఉండిపోయింది. విశ్వాసం కొద్దీ అమ్మమ్మ యజమాని కనిపిస్తే తోక ఆడించుకుంటూ దగ్గరికి వెళ్ళబోతే ఆయన చేతి కర్రతో ఒక్క దెబ్బ కొట్టేవాడు. ఆ కుటుంబం నుంచి అమ్మమ్మ వెలి వేయబడ్డది. యజమాని కూతురు గతీ అంతే అయిందిగా? ప్రేమించి పెళ్ళి చేసుకుందని కూతుర్ని ఇంటికి రానియ్యకుండా వేశారు. కులగోత్రాలు, వంశకీర్తి—సమస్తం మంటలో కలిపి ఒక అనామకుణ్ణి పెళ్ళి చేసుకుందట. "ఈ పెద్దింటి వాళ్ళకి అసలు నీతీ, జాతీ ఉందా అనిపిస్తుంది. చేసేవి అఘమర్షణ స్నానాలూ, దూరేవి దొమ్మరి గుడిసె లూను. మే మిద్దరం ఏం తప్పు చేశామని! గాఢంగా ప్రేమించుకున్న ప్రియులతో పోయాము. ఇదీ తప్పే? ఆయన తెచ్చిన నవ మన్మథులను మేము మెరదూ, గుండె ఉపయోగించకుండా, తెచ్చి పెట్టుకున్న ప్రేమతో, మందహాసంతో మైమరిపించే మమతతో దగ్గర చేరి ప్రేమించి పెళ్ళి చేసుకోవాలా? లేకపోతే వెలేస్తారా? ఇంటి నుండి తరిమేస్తారా? దీని కంతకీ ధన మదం! అంతకన్నా వేరే ఏమీ లేదు."

అమ్మమ్మను నౌకరు ఎంతో బాగా చూసుకునేవాడు. యజమాని నిర్లక్ష్యానికి లోలోపల తిట్టుకున్నాడు.

'ఈ డబ్బు గల వాళ్ళంతే! ఒకవాడు దీన్ని హంసతూలికాతల్పం పైనే పడుకోబెట్టేవాడు. తన కారులోనే తిప్పేవాడు. కింద కాలు మోపనిచ్చే వాడు కాదు. ఈ వేళ సంకరమై పోయిందట. అందరిలోనూ రక్తమే పారుతూందే! అందరి రక్తం ఎర్రగానే ఉంటుందే! జీవాలన్నిటికీ ప్రాణం ఒకటే. ప్రేమకూడా ఒకటే!'

ఒకనాటి అర్ధరాత్రి అమ్మమ్మ ఈనింది. మా అమ్మ పుట్టింది. అచ్చంగా అమ్మమ్మ ప్రియుని పోలికేనట!

"హరి దీని తస్సాదియ్యా! సరిగ్గా ఆ వీధి కుక్క పోలికలే!" అని నౌకరు ఆశ్చర్యపోయాడు.

తన కూతుర్ని చూసి అమ్మమ్మ మురిసిపోయింది. 'నా తల్లికి సరిగ్గా నాన్న పోలికలే! నా జన్మ తరించింది' అని అమ్మమ్మ కూతుర్ని నఖశిఖపర్యంతం నాకింది. ముద్దు పెట్టుకుంది. కడుపు నిండా పాలిచ్చింది.

అమ్మమ్మకి ఒక్కటే కోరిక—బిడ్డని ఎలాగైనా తనకి ప్రసాదించిన ప్రియునికి చూపించాలని. ఒకనాడు నౌకరు ఇంట్లో లేనప్పుడు పిల్లని వెంటేసుకుని వీథిలోకి వెళ్ళింది. ఆ కుక్క కనిపించలేదు. ఆ వీథి దాటి రెండో వీథిలోకి వెళ్ళింది. అదే మొదటిసారి అలా స్వేచ్ఛగా, నిర్భయంగా బయటికి వెళ్ళడం. అంతా కొత్త ప్రపంచం. అంతా వింతగా తోచింది. అరిచింది. అరిచి ఉన్న పిల్లకి నిలబడి పాలిచ్చింది. తిరిగి నడిచింది. ఎక్కడ చూసినా జనసమ్మర్దం. ఎటు చూసినా రివ్వుమని కార్లూ, మిగతా వాహనాలూ అటూ ఇటూ పరుగెడుతూండడం చూసి భయపడి, ప్రియాన్వేషణ మానుకుని పిల్లని దగ్గరగా నడుపుకుని ఎలాగో తిరిగి ఇల్లు చేరుకుంది.

'బిడ్డని చూసుకుందుకు తనే వస్తాడు!' అని మనస్సుకి నచ్చచెప్పుకుంది.

"ఏరా! ఆ వెధవ కుక్క పిల్లనికూడా దాని తల్లితోబాటు ఇక్కడే ఉంచావా?"

"చిత్తం."

"వల్లకాదు. దాన్ని వీథిలో వదిలెయ్యి. వెధవ పని చేసింది. ఇంకా సిగ్గు లేక పిల్లని చూసుకుంటూ మురిసిపోతూందా? వెంటనే దాన్ని వీథిలో వదిలెయ్యి."

"చిత్తం!"


నౌకరు పిల్లలు కలవాడు. వాళ్ళంతా ఆ కుక్కపిల్లతో ఆడుకునేవారు. దాన్ని యజమాని ఆజ్ఞ ప్రకారం తల్లి నుంచి వేరుచేసి వీథిలో ఎలా వదిలి వేయడం? నౌకరుకి ఏమీ పాలు పోయింది కాదు. అమ్మమ్మ చూస్తే బిడ్డను కరిచి పెట్టుకునే ఉంటూంది. నౌకరు సమయం కోసం కాసుక కూర్చున్నాడు. కుక్కపిల్లకూడా కాళ్ళలో సత్తువ రాగానే, అటూ ఇటూ పరుగులు తియ్యడమే కాకుండా పెత్తనాలు చేయ ప్రారంభించింది. ఆ అదును చూసుకుని నౌకరు దాన్ని మెల్లిగా తీసుకుపోయి ఊరవతల వదిలి పెట్టి చక్కా వచ్చాడు.

'పర్వాలేదు. దాని బతుకది బతకగల వయస్సొచ్చింది.'

అమ్మమ్మ పిల్ల కనిపించక తోటంతా తిరిగింది. ఏడ్చింది. నౌకరు వైపు ముఖం పైకెత్తి, కుయ్యోమని ఏడిచింది. పిల్లలు ఏడ్చారు. ఆఖరికి నౌకరుకూడా 'ఛీ! ఎదవ పని చేశాను. అందర్నీ ఏడిపిస్తున్నా. కుక్కకు తెలిసిన కడుపు తీపి యజమానికేం తెలుసు!' అని ఛాలా బాధ పడ్డాడు.

ఆ కుక్కపిల్లకే నేను పుట్టాను.

"ఒరే, నాయనా! మొదట్లో నేనెంత



పందాలు — ఫొటో—కె. గజేంద్రన్ (మద్రాసు)


ధాన్యం    చిత్రం—బి. ఎల్. రామాంజనేయులు (గుంతకల్)

బాధ పడ్డావని! తిండి లేదు. అమ్మమ్మ పోలిస్తే పెంచిందిరా! తినడం తెలియదు. సైగా తినడాని కేముందని! ఎవరు పెడతారని! తతిమ్మా కుక్కలతో కలిసి పోయాను. అవి ఎక్కడి కెడితే అక్కడికి నేనూ వెళ్ళేదాన్ని. వాటితోబాటు నేనూ దెబ్బలు తినేదాన్ని. చెత్తకుండీ లెక్కడ ఉంటే అక్కడికి మేమంతా తయారు. అప్పుడే మీ నాన్నతో నాకు స్నేహమైంది. మాంచి బలంగా ఉండేవాడు. ఎప్పుడూ నన్ను కాపాడుతూ నా వెంటే ఉండే వాడురా! చెత్తకుండీలో తాను మొదట దిగి నన్ను లోపలికి దూకమని సంజ్ఞ చేసేవాడు. ఎంత మంచివాడని! దొరికిన దల్లా నాతో పంచుకునే వాడు. తక్కిన మగ కుక్కలు నా వెనకాల పడేవి! ఆడదాన్ని చూస్తే ఎందు కీ మగ పీనుగులకి ఒళ్ళు తెలియదో! నాకు ఎక్కడలేని భయం వేసి. తోక ముడుచుకుని కూర్చునేదాన్ని! కూర్చుంది కదా అని పోనిస్తారా? పోకుండా అన్నీ నా చుట్టూరా ప్రదక్షిణం చేసి ఎక్కడ లేని ప్రేమనూ ఒలకబోస్తూ నన్ను నాకేవి! అవి నన్ను నాకితే ఏవగింపు కలిగేది. కాని, ఏం చేయగలను? నా స్నేహితుడు దూరంగా నిలబడి గర్వంగా నా వైపు చూసేవాడు.

వాటి పీడ వదిలించుకుని మేమిద్దరం ఎదురుగుండా కడుతూన్న ఇంట్లో కాపురం ఉండేవాళ్ళం. అంటే, రాత్రిళ్ళక్కడ పడుకునే వాళ్ళం. తెల్లవారగానే పనివాళ్ళు వచ్చేవాళ్ళు. వాళ్ళ చేతిరాళ్ళ దెబ్బలు తినకుండా తెల్లారగానే వీధుల్లో పడే వాళ్ళం. అలాగ నా స్నేహితునితో ఉంటూన్న సమయంలోనే నువ్వు నా కడుపున పడ్డావురా!"

అమ్మా, నేనూ, నాన్నా కలిసి ఉంటూ వచ్చాము. కడుతూన్న ఇంట్లోనే నేను పుట్టాను. నేను కాస్త పెద్దవాణ్ణి అవుతూండగానే ఆ ఇల్లు పూర్తి అయింది. ఇంటివాళ్ళు గృహప్రవేశం చేసుకుని ఇంట్లో ప్రవేశించారు. ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావిడి అన్నట్లు గృహప్రవేశంనాడు మేమంతా చాలా హడావిడిగా ఉన్నాము. బయటికి వెళ్ళకుండా అక్కడే దూరంగా కూర్చున్నాము, తినడానికి తిండి దొరుకుతుందనే గంపెడాశతో.

ఆ ఇంట్లో పెద్ద విందు జరిగింది. నా కేం తెలుసు? కుర్రతనం కొద్దీ అమ్మా, నాన్ననీ వదిలి ఆ కొత్తింటి ఆవరణలోకి పరుగెత్తాను. దూరంనుంచి రాయి వచ్చి నా కాలికి చచ్చేలా తగిలింది. మొర్రోమని ఏడ్చాను. పరుగెత్తలేక పోయాను. నా ఏడ్పు విన్న అమ్మా, నాన్నా పరుగెత్తుకుంటూ వచ్చి గేటు దగ్గిర నిలబడ్డారు. నేను నెమ్మదిగా కుంటుకుంటూ వచ్చి వారిని కలుసుకున్నాను.

"చెప్పిన మాట వినవు కదా? వద్దురా, వాళ్ళు కొడతార్రా అని మొర పెట్టుతూనే ఉన్నా!... ఎక్కడ తగిలిందిరా? కాస్సేపు వుడుకో! అదే తగ్గి పోతుందిలే" అని అమ్మ దెబ్బ తగిలిన చోట జాలిగా నాకింది.

విందు అయిపోయినట్లుంది. ఎంగిలాకు లన్నిటినీ మట్టి బయటి కుండీలో పారేశారు. మేము చూడనే లేదు. ఎక్కణ్ణించి వచ్చి పడ్డాయో కుక్కలు. ఆకుల్లో కలియబడ్డాయి. మంచితనంగా ఉండి ఉన్న చోటనే ఉంటే లాభం లేదని మేముకూడా కలియబడ్డాము. దెబ్బ లాటలైనాయి. బలాబలాలు చూసుకున్నాము.

ఒక యథార్థం గ్రహించాను. బలవంతుడే ఈ ప్రపంచంలో బతకగలడని. మానవుల విషయంలో వేరనుకోండి. బలవంతుణ్ణికూడా బక్క పీనుగు మింగి వేయ గలుగుతున్నా డీ రోజుల్లో. ఏమిటా రహస్యమని అడుగుతున్నారా? కపటి, వంచకుడు, నీతి, నిజాయితీ లేనివాడు ఈ నాడు ఈ సంఘంలో చలామణీ అవుతున్నాడు. ముక్కుకు సూటిగా పోతాను, ఆదర్శప్రాయంగా బతుకుతాను అని అనుకున్నవాడు హారతి కర్పూరంలా హరించుకుపోతాడు.

• • •

దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా—

అని మానవతలో విశ్వాసం ఉన్న వైతాళికులు మానవులకు ప్రబోధం చేశారు. కాని, ఈ నాడు ఆ ప్రబోధాలన్నీ చెవిటి వానిముందు శంఖం ఊదినట్లే. ఈ దేశంలో భాగ్యవంతులు మరింత భాగ్యవంతు లవుతున్నారు. బీదవాళ్ళు మరీ దరిద్రు లవుతున్నారు. అయినా, మాది స్వతంత్ర దేశం! మేమూ స్వతంత్రులం. మనది రామరాజ్యం! మనది గాంధీ పుట్టిన దేశం.

నమ్ముతారో, నమ్మరో—ఈ స్వతంత్ర దేశంలో ఆకలి హాహాకారాలు తప్ప ఆనందంగా, హాయిగా నవ్వుతూన్న ముఖం కనిపించడం లేదు. నవ్వు వినిపించడం లేదు. నవ్వడం మరిచిపోయారు భారతీయులు. ఓర్వలేనితనం హెచ్చిపోయింది. పచ్చగా ఎవడేనా కనిపిస్తే అరుదనుకోండి. ఎదుటివాడి కళ్ళు భగ్గుమంటాయి.

ఎక్కడ చూసినా బిచ్చగాళ్ళే. ఎవరిని చూసినా కంకాళంలా కనిపిస్తున్నాడు.

మా గతికూడా ఆ పరిస్థితికే వచ్చింది. చెత్తకుండీలు మా హక్కు భుక్తాలు కదా? ఇప్పుడు వాటి మీదికికూడా మానవులు ఎగబడుతున్నారు. అందుమూలంగా మేము అంతమాత్రం తిండికూడా లేకుండా మాడిపోతున్నాము. వాళ్ళతో బాటు కలియబడి బలాబలాలు చూపలేము. కారణం — వాళ్ళకి మెదడు ఉంది. చేతులున్నాయి, కాళ్ళున్నాయి. భగవంతుణ్ణి మేము ప్రార్థించేది ఒక్కటే! చెత్తకుండీల పై దాడి సల్పే మానవుల్నికూడా కుక్కల్ని చేయండి. అప్పుడు మేము సమానంగా బలాబలాలు చూసుకుని బతక ప్రయత్నిస్తాము. ★